
www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 31 జనవరి 2024







నిబంధనలకు 'మెగా' పాతర..!

● 'ఉపాధి' కొలతలూ మాయం ● అంతా అధికార పార్టీ అండతోనే ● గ్రామస్తులు అడ్డుకున్నా బేఖాతర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

మదనపల్లి-నాయుడుపేట జాతీయ రహదారి విస్తరణ పనులు చేపడుతున్న మెగా సంస్థ మట్టి దందా ఇప్పుడల్లా ఆగేలా కనిపించడం లేదు.. రహదారి విస్తరణ పనులు పూర్తయ్యేలోపు చెరువులు, ప్రభుత్వ భూములు, రహదారులను, ఊర్లను చిద్రం చేసే వరకూ ఊరుకునేలా లేదు ..మా చెరువుల్లోంచి మట్టి తోలొద్దని, గ్రామీణ రహదారుల్లో రాకపోకలు సాగించొద్దని రైతులు, గ్రామస్తులు మొత్తుకుంటున్నా యాజమాన్యం ఏ మాత్రం ఖాతరు చేయడం లేదు. స్థానికంగా ఉండే అధికార పార్టీ నాయకుల అండ చూసుకుని తవ్వకాలు చేస్తున్నారు. మెగా సంస్థ మట్టి దందా పరాకాష్ట ఏ స్థాయికి చేరిందంటే చెరువుల్లో ఉపాధి కూలీలు చేసిన పనుల్లో కొలతలను సైతం మాయం చేస్తోంది. అధికారపార్టీ అండదండలతో పాటు, ప్రభుత్వ యంత్రాంగం ఆశీస్సులు మెండుగా ఉండటంతో మెగా సంస్థ మట్టి దోపిడీ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తారా స్థాయికి చేరిందన్న విమర్శలు ఉన్నాయి.

చెరువుల్లో 'మెగా' లీలలు

మదనపల్లి-నాయుడుపేట జాతీయ రహదారి పనులను మెగా సంస్థ రూ.5 వేల కోట్ల వ్యయంతో చేపట్టింది. ఈ ప్రాజెక్టు పనులు 2023లోనే పూర్తి కావాల్సి ఉండగా పరిహారం, కోర్టు వివాదాల నేపథ్యంలో సాగుతూ వస్తోంది. అయితే 2022 నుంచి రహదారి విస్తరణ పనుల్లో వేగం పుంజుకోగా, మొదటి విడతలో భాగంగా నాయుడుపేట నుంచి రేణిగుంట వరకు ఆరు లేన్ల రోడ్డును వేస్తున్నారు. ఈ నేపథ్యంలో రోడ్డును ఐలెవేషన్ చేసేందుకు అవసరమైన మట్టిని, ఎర్రగ్రావెల్‌ను మెగా యాజమాన్యం ప్రభుత్వ భూములు, రైతుల ప్రైవేటు పొలాలు, చెరువుల నుంచి తరలించేందుకు పూనుకుంది. ఈ క్రమంలో అధికారుల నుంచి, గ్రామస్తులు, రైతుల నుంచి కనీస అనుమతులు తీసుకోవాలన్న నిబంధనలను మరిచింది. అధికారపార్టీ అండ చూసుకుని తప్పిన కాడికి తవ్వుకుంటున్నారన్న ఆరోపణలు పెచ్చుమీరుతున్నాయి. మెగా సంస్థ జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టిన నాటినుంచి శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని వందల చెరువుల్లో పరిమితికి మించి తవ్వకాలు చేశారన్న విమర్శలు ఉన్నాయి. చెరువుల్లో కేవలం ఒక మీటరు లోతులో మాత్రమే మట్టిని తవ్వాల్సిన నిబంధన ఉంది. అంతేకాకుండా తూములు, కలుజులు, చెరువు కట్టలకు దగ్గరగా తవ్వకాలు చేయకూడదన్న నిబంధన ఉంది. అయితే మెగా యాజమాన్యం ఆ నిబంధనలను తుంగలో తొక్కేసి ఇష్టమొచ్చిన చోట, ఇష్టమొచ్చిన లోతులో తవ్వకాలు చేసేస్తోంది. ఫలితంగా భవిష్యత్తులో కట్ట, తూములు దెబ్బతినే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అంతేకాకుండా చెరువుల్లో పరిమితికి మించి మట్టిని తరలించడం వల్ల భూగర్భ జలాలు సైతం అడుగంటి పోయే ప్రమాదం ఉంది. తొట్టంబేడు మండలంలోని లింగమనాయుడుపల్లి, రౌతుసూరమాల, గుండేలిగుంట, కాసరం, శ్రీకాళహస్తి మండలంలోని ఉడమలపాడు, పెళ్లకూరు చెరువుల్లో పెద్ద ఎత్తున మట్టి, ఎర్ర గుల్ల తవ్వకాలు చేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఈ క్రమంలో చెరువుల్లో వ్యవసాయ కూలీలు చేసిన ఉపాధి హామీ పనుల కొలతలను నాశనం చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా కాసరం చెరువులో పరిమితికి మించి తవ్వకాలు చేయడం వల్ల రూ.10 లక్షల వ్యయంతో చేపట్టిన ఉపాధి హామీ పనుల కొలతలు నాశనం చేశారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులు, రెవెన్యూ అధికారులు, ఉపాధి హామీ సిబ్బందికి తెలియజేసినా పట్టించుకోలేదని వాపోయారు. ఈ చెరువులో చేసిన ఉపాధి పనుల కొలతలపై ఇంకా ఆడిటింగ్ జరగలేదని, సామాజిక తనిఖీ బృందం తనిఖీలకు వస్తే తామే చూపించాలని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే చెరువుల్లో మట్టి తవ్వకాలు చేసేటప్పుడు తప్పకుండా ఇరిగేషన్ అధికారుల అనుమతి తోడు, గ్రామ పెద్దల సహకారాన్ని కూడా కోరాల్సి ఉంటుంది. ఆ చెరువులో మట్టి తవ్వకాలు చేసినందుకు గాను క్యూ.మీటరకు ఇంతని గ్రామానికి పరిహారం ఇవ్వాల్సి ఉంటుంది. అయితే మెగా యాజమాన్యం ఇవేమీ చేయకుండా అక్కడున్న స్థానిక వైసీపీ నేతలతో చేతులు కలిపి గ్రామాలకు దక్కాల్సిన పరిహారానికి కూడా ఎగనామం పెట్టారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మెగా యాజమాన్యం చెర నుంచి చెరువులను, కుంటలను కాపాడాల్సి ఉంది.

రేపు చెన్నైలో ర్యాలీని జయప్రదం చేయండి

ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుని పిలుపు

ప్రజాశక్తి - క్యాంపస్ (ఎస్వీయూ)

నూతన విద్యా విధానం (ఎన్ఈపి) వల్ల విద్యార్థులలో అసమానతలు పెరుగుతున్నాయని, ఉన్నత విద్యలో విద్యార్థుల చేరికలు క్రమంగా తగ్గుతున్నాయని, కొంత మందికే విద్య అందే విధంగా ఎన్ఈపి 2020 ఉందని ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు విపి సాను అన్నారు. నూతన విద్యా విధానాన్ని నిరసిస్తూ ఫిబ్రవరి 1న చెన్నైలో జరుగున్న భారీ ర్యాలీలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎస్వీయూలో 'నూతన విద్యా విధానం.. నీట్ రద్దు' అంశంపై మంగళవారం సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా విపి సాను, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ ముందుగా మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అక్బర్ అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో ప్రసన్నకుమార్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా అమలు చేయని విధంగా రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని అమలు చేసి, విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తూ, ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే కుట్ర చేస్తోందని మండిపడ్డారు. డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వకుండా, ప్రభుత్వ పాఠశాలలో టీచర్స్ పోస్టులు భర్తీ చేయకుండా నాడు నేడు అంటూ మోసపూరిత విధానాలు అమలు చేస్తున్నారని అన్నారు. ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు మాధవ్ కష్ట మాట్లాడుతూ విద్య రోజు రోజుకూ ఖరీదు అవుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య దూరం అవుతుందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి భగత్ రవి మాట్లాడుతూ నూతన విద్యా విధానం రద్దు చేయాలని ఢిల్లీలో జనవరి 12 న పెద్ద ఎత్తున నిరసన జరిగిందని, ఫిబ్రవరి 1వ తేదీన చెన్నై లో భారీ ర్యాలీ ఉంటుందని, వేల సంఖ్యలో విద్యార్థులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ బేరర్స్ అశోక్, వినోద్, హరిత, యూనివర్సిటీ అధ్యక్షులు నరేంద్ర, నాయకులు శివ, పవన్, వీరేష్, హర్షత్ తదితరులు పాల్గొన్నారు.



దీక్ష కొనసాగిస్తున్న అటవీ కార్మికులు


టిడిపిలోకి కోనేటి ఆదిమూలం

ప్రజాశక్తి - పిచ్చాటూరు

సత్యవేడు నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు శరవేగంగా మారుతున్నాయి. ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారిన సిట్టింగ్ ఎంఎల్ఎ కోనేటి ఆదిమూలం త్వరలోనే టిడిపి కండువా కప్పుకోనున్నారు. మంగళవారం రాజధాని అమరావతిలో యువనేత నారా లోకేష్‌తో కలిసి ఉన్న ఫొటో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ చర్చకు తావిచ్చింది. ఈ నేపథ్యంలో సత్యవేడు నియోజకవర్గంలో పెద్దిరెడ్డి అనుచరగణం కోనేటి ఆదిమూలం దిష్టిబొమ్మను దగ్ధం చేయడం గమనార్హం. సిఎం జగన్మోహన్‌రెడ్డి జరిపిన సర్వేలో ఆదిమూలంకు ప్రతికూలంగా ఉందని చెప్పి సత్యవేడు నియోజకవర్గానికి ఎం.గురుమూర్తిని ఎంఎల్ఎ అభ్యర్థిగా ప్రకటించారు. సిట్టింగ్ ఎంఎల్ఎగా ఉన్న ఆదిమూలంను తిరుపతి ఎంపి అభ్యర్థిగా కుండమార్పిడి చేశారు. అయితే 'నియోజకవర్గం' వదిలి వెళ్లడం ఇష్టం లేని ఆదిమూలం స్థానికంగానే తాను ఉంటానంటూ తన అనుచరగణంతో వెల్లడించారు. అధిష్టానం ఏమాత్రం దిగిరాకపోవడంతో మంత్రి పెద్దిరెడ్డిపై విమర్శలు గుప్పించారు. దీంతో ఆగ్రహించిన మంత్రి పెద్దిరెడ్డి కోనేటి ఆదిమూలంపై గుర్రుమన్నారు. దీంతో జీర్ణించుకోలేని ఆదిమూలం టిడిపి తీర్థం పుచ్చుకునేందుకు తయారయ్యారు. ఈ నేపథ్యంలోనే నారా లోకేష్‌ను కొడుకు సుమన్‌తో కలిసారు. పార్టీ తీర్థం పుచ్చుకునే విషయంలో ఇప్పటికే జిల్లాకు చెందిన ఓ మాజీ మంత్రితో మంతనాలు జరిపి అధినేత నారా చంద్రబాబునాయుడుతోనూ టచ్‌లో ఉన్నట్లు సమాచారం. ఈ సందర్భంగా కోనేటి ఆదిమూలం మీడియాతో మాట్లాడుతూ రాత్రనకా పగలనకా తనతో నడిచిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. తాను ఎంఎల్ఎగానే పోటీ చేస్తానని, ఎంపిగా చేయనని మంత్రి పెద్దిరెడ్డిని కలిసి మాట్లాడానన్నారు. తనకు టిక్కెట్ ఇవ్వాలని అపరంజి రాజు, దశరథ, చిన్న, హరినాథ్ తదితర 80 మంది మంత్రిని కలిసారని తెలిపారు. తనకు తెలియకుండా ఈనెల 25, 26 తేదీల్లో ఎం.గురుమూర్తిని నియోజకవర్గం మొత్తం చుట్టించేలా చేశారని, 27న తిరుపతిలో తనకు తెలియకుండా ఆత్మీయ సమావేశం పెట్టారన్నారు. నియోజకవర్గంలో ఇసుక, మట్టి కొల్లగొడుతూ వాటి తరలింపుకు చెక్‌పోస్టును పెట్టుకున్న కొందరు నేతలు తనకు వ్యతిరేకంగా రిపోర్టు ఇవ్వడం న్యాయమేనా అని వాపోయారు. తనను రెచ్చగొట్టి రెబల్‌గా మార్చడానికే తిరుపతిలో ఆత్మీయ సమావేశం పెట్టారని మండిపడ్డారు. తన బాధను చెప్పుకుంటే తనను సస్పెండ్ చేయడం ధర్మమేనా అని ప్రశ్నించారు.

పిచ్చాటూరు వైకాపా కన్వీనర్ చలపతిరాజు ఆధ్వర్యంలో 'దళిత ద్రోహి ఎంఎల్ఎ కోనేటి ఆదిమూలం' అని దిష్టిబొమ్మను జాతీయ రహదారిపై దహనం చేశారు. రమేష్‌రాజు, సుబ్రమణ్యంరెడ్డి, భాస్కర్‌నాయుడు, తొప్పయ్య, పాల పద్మనాభం పాల్గొన్నారు. బిఎన్ కండ్రిగ బస్టాండ్ సమీపంలో సీనియర్ నాయకులు ఉగ్గుమూడి గురునాథం, కంచనపుత్తూరు గురవయ్య, ప్రసాద్ పాల్ ఆధ్వర్యంలో ఆదిమూలం దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.

రాజధానిలో లోకేష్ చెంత మంతనాలు





నేడు బాధ్యతలు చేపట్టనున్న కలెక్టర్ లక్ష్మీషా

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



ఎండి గృహ నిర్మాణ శాఖ నుండి లక్ష్మీ షా తిరుపతి జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయిన నేపథ్యంలో బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. మంగళ వారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న వీరికి సంయుక్త కలెక్టర్ శుభం బన్సల్, విమానాశ్రయ డైరెక్టర్ శివప్రసాద్, శ్రీకాళహస్తి, తిరుపతి ఆర్డీఓ లు రవి శంకర్ రెడ్డి, నిషాంత్ రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా గహ నిర్మాణ శాఖ అధికారి వేంకటేశ్వర రావు, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాల కొండయ్య స్వాగతం పలికారు. బుధవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం తిరుపతి జిల్లా కలెక్టర్ గా లక్ష్మీ షా బాధ్యతలు చేపట్టనున్నారు.



దీక్ష భగ్నం చేసినా.. తగ్గేదేలే..!

అటవీ కార్మికుల సమస్య పరిష్కరించాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిలపక్షం

మరో ఏడుగురితో నిరవధిక దీక్ష కొనసాగింపు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

అటవీ కార్మికులు చేస్తున్న నిరవధిక దీక్షలను సోమవారం అర్ధరాత్రి పోలీసులు భగ్నం చేయడంతో, ఏమాత్రం వెనకడుగు వేయకుండా అటవీ కార్మికులు దీక్షను కొనసాగించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి సహా, మరో ఎనిమిది మంది అటవీ కార్మికులను పోలీసులు బలవంతంగా వారి ఆరోగ్యం క్షీణించిందన్న సాకుతో అరెస్టు చేసి, రుయాసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో అప్పటికప్పుడే మరో ఏడుమంది అటవీ కార్మికులు దీక్షా శిబిరం ఖాళీ అవకుండానే పూలమాలలు ధరించి దీక్షను కొనసాగించారు. ఎంతమందిని అరెస్టు చేసినా సమస్య పరిష్కారం అయ్యేంత వరకూ దీక్ష ఆపేది లేదని వెల్లడించారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరంటూ నినదించారు. మంగళవారం వీరి దీక్షలకు అఖిలపక్షం సంఘీభావం ప్రకటించింది. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు మాట్లాడుతూ టిటిడి యాజమాన్యం చర్చలకు పిలిచి అర్ధరాత్రి దీక్షల్లో ఉన్నవారిని అరెస్టు చేయిస్తారా? అని ప్రశ్నించారు. ఫారెస్టు కార్మికులకు టైంస్కేల్ వర్తింపజేస్తామని టిటిడి బోర్డు చేసిన తీర్మానం అమలు చేయకుండా, హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయకుండా, టిటిడి ఈవో ఎవి ధర్మారెడ్డి అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఫారెస్టు కార్మికులు చేస్తున్న దీక్షకు సిపిఎం అండగా ఉంటుందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఆర్‌పిఐ అధ్యక్షులు పి.అంజయ్య, ఎపి ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య మాట్లాడుతూ ఫారెస్టు కార్మికులను విడగొట్టి కొంతమందిని పర్మినెంట్ చేసి, మరికొంతమందిని కార్పొరేషన్‌లో కలపడం వివక్ష కాదా? అని ప్రశ్నించారు. సమస్య పరిష్కరించకుండా పోలీసులతో దీక్షను భగ్నం చేయడాన్ని తప్పుబట్టారు. చిత్తూరు జిల్లా సిఐటియు జిల్లా నాయకులు చైతన్య, సురేంద్ర, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, టిఎన్‌టియుసి నాయకులు రెడ్డెప్పనాయుడు మాట్లాడుతూ ఫారెస్టు కార్మికుల జీవితాలతో టిటిడి చెలగాటమాడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కారయదర్శి టి.సుబ్రమణ్యం, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్,రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ నేత శ్రీను, నాయకులు మునిరాజా, ఆర్టీసీ ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర నాయకులు ఇఎస్ కుమార్, సిఐటియు నాయకులు ఆర్.లక్ష్మి, పి.బుజ్జి, చిన్నా, వాసు, తంజావూరు మురళి, తిరుపతి అన్నారావు సర్కిల్ స్టాండ్ నాయకులు కుమార్, శంకరయ్య పాల్గొన్నారు.

టిటిడి బోర్డు ఛైర్మన్‌కు సిఐటియు అభినందనలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

టీటీడీ ఎఫ్ఎంఎస్, హెల్త్ విభాగం టెండర్‌లో కొత్తగా తీసుకొచ్చిన నిబంధనలను రద్దు చేసిన టిటిడి పాలకమండలి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డికి, డిప్యూటీ మేయర్ అభినయరెడ్డికి సిఐటియు నేత టి.సుబ్రమణ్యం అభినందనలు తెలిపారు. నూతన నిబంధనల వల్ల వేలాదిమంది కార్మికులు రోడ్డున పడతారని వారి దృష్టికి సిసిఐటియు నేతలు తీసుకెళ్లడంతో ఛైర్మన్ సానుకూలంగా ప్రకటించి, నిబంధనలను రద్దు చేయాలని ఆదేశాలిచ్చారు.

అనంత రవితేజకు అరుదైన గౌరవం



తిరుపతి టౌన్ : తిరుపతికి చెందిన అనంత రవితేజకు అమెరికాలో అరుదైన గౌరవం దక్కింది. విద్యారంగంలో అసాధారణమైన ప్రతిభ చూపే వ్యక్తులకు ప్రదానం చేసే ప్రతిష్టాత్మక ఇబి 1 వీసాను అనంత రవితేజ అందుకున్నారు. తిరుపతి నలందానగర్‌లో నివాసం ఉంటున్న అనంత రమేష్‌నాయుడు, నీలిమల పెద్ద కుమారుడు రవితేజ. ప్రస్తుతం అమెరికాలోని వాషింగ్టన్‌లోని ఆపిల్ కంపెనీ హెడ్ క్వార్టర్స్‌లో ప్రిన్సిపాల్ రీసెర్చ్ సైంటిస్ట్ హోదాలో పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో ఓ సైంటిస్ట్‌గా అసాధారణ ప్రతిభ చూపిన రవితేజను అమెరికా ప్రభుత్వం గౌరవ ప్రదంగా ఇబి 1 వీసాను మంజూరు చేసింది. ప్రఖ్యాత సైంటిస్ట్ ఐన్‌స్టీన్ ఈ వీసాపైనే అమెరికాలో అడుగుపెట్టారు.

సమస్యలు పరిష్కరించలేని సభలెందుకు..?

ప్రజాప్రతినిధులు, అధికారులు డుమ్మా

ప్రజాశక్తి- వరదయ్యపాలెం



మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు డుమ్మా కొట్టడంతో సభ వెలవెలబోయింది. ఇంద్రానగర్ సర్పంచి వీరభద్రం మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను ఇప్పటివరకూ అధికారులు పట్టించుకోలేదన్నారు. పంచాయతీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినా పూర్తిస్థాయిలో పనులు జరగలేదని మండిపడ్డారు. మార్కెటింగ్ కమిటీ సభ్యులు వీరాస్వామి మాట్లాడుతూ ఎంఎల్ఎ హెచ్చరించినా ప్రజా సమస్యలను తీర్చడంలో అధికారులు శ్రద్ధ చూపడం లేదన్నారు. కారిపాకం సర్పంచి ఆనంద్ మాట్లాడుతూ తాగునీటి అవసరానికి బోరు వేయాలని రెండేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా స్పందన కరువయ్యిందన్నారు. పులివెల్లం సర్పంచి బాలకృష్ణ మాట్లాడుతూ స్థానిక నాయకులకు కాకుండా ఇతర ప్రాంతాల వారికి కాంట్రాక్టు పనులు అప్పగించడం ఏంటని ప్రశ్నించారు. వైసిపి నాయకులు దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం మండలంలో ఎక్కువగా ఉందన్నారు. వచ్చే మండల సమావేశానికల్లా విద్యుత్ సమస్యలు పరిష్కరించని పక్షంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళతామన్నారు.

తిరుపతి అభివృద్ధికి కృషి చేస్తా :అధితి సింగ్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి పుణ్యక్షేత్రం అభివృద్ధికి అందరిని సమన్వయం చేసుకొని కృషి చేస్తానని తిరుపతి నగరపాలక సంస్థ నూతన కమిషనర్‌గా మంగళవారం బాధ్యతలు చేపట్టిన అధితి సింగ్ అన్నారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాంబర్లో భాధ్యతలు చేపట్టిన అనంతరం ఆమె మాట్లాడుతూ విశాఖపట్నంలో ట్రైనీ కలెక్టర్‌గా, విజయవాడలో సబ్ కలెక్టర్ గా పని చేసిన తనకు తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ గా భాద్యతలు చేపట్టడం సంతోషంగా వుందన్నారు. అధితి సింగ్‌కు డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్.కె.బాబు, నరసింహాచారి అభినందనలు తెలిపారు.



నూతన డిప్యూటీ కమిషనర్ అమరయ్య

3-5 తేదీల్లో తిరుమలలో సనాతన ధార్మిక సదస్సు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుమల ఆస్థాన మండపంలో ఫిబ్రవరి 3 నుండి 5వ తేదీ వరకు టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సనాతన ధార్మిక సదస్సుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేయాలని ఈవో ఎవి.ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. తిరుపతి టీటీడీ పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో మంగళవారం ఈవో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ తిరుమల ఆస్థాన మండపంలో మూడు రోజుల పాటు జరగనున్న సనాతన ధార్మిక సదస్సులో దేశంలోని ప్రముఖ మఠాధిపతులు, పీఠాధిపతులు, స్వామిజీలు పాల్గొంటారన్నారు. సదస్సుకు విచ్చేసే స్వామీజీలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ముగ్గురు సీనియర్ అధికారులతో కూడిన సమన్వయ కమిటీని ఏర్పాటు చేసి, వివిధ మఠాధిపతులు, పీఠాధిపతులను సంప్రదించాలన్నారు. ప్రతి స్వామిజీకి ఒక లయిజాన్ అధికారిని నియమించాలన్నారు. ఈ సమావేశంలో జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, వేద విశ్వవిద్యాలయం విసి ఆచార్య రాణి సదాశివమూర్తి, డిపిపి కార్యదర్శి సోమయాజులు, ప్రోగ్రాం అధికారి రాజగోపాల్, దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి ఆనందతీర్థాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను నివారిద్దాం

ప్రజాశక్తి - తిరుపతి సిటి



క్యాన్సర్ నివారణలో తిరుపతి జిల్లాను ఆదర్శంగా చేద్దాం అని స్విమ్స్ ఉపకులపతి ఆర్‌వి కుమార్ పిలుపునిచ్చారు. స్విమ్స్ శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం శ్రీ పద్మావతి ఆడిటోరియంలో 'మిడ్ లెవెన్ హెల్త్ ప్రొవైడర్స్' శిక్షణ నిర్వహించినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. ఆర్‌వి కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్ రోగులను తొలిదశలోనే గుర్తించి వారికి చికిత్స అందించి ఆస్పత్రులకు తరలించే బాధ్యతలను మిడిల్ లెవెల్ హెల్త్‌ప్రొవైడర్స్ తీసుకోవాలని సూచించారు. బయో ప్రత్యేకాధికారి డాక్టర్ ఎం.జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 4 నుంచి పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్ నిర్ధారణ శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. డిఎంహెచ్ఒ డాక్టర్ శ్రీహరి, డిపిఎంఒ డాక్టర్ అరుణ సులోచన, అంకాలజీ నోడల్ ఆఫీసర్ ప్రత్యూష పాల్గొన్నారు.

ట్రాఫిక్ జామ్‌తో తమిళ సినిమా షూటింగ్ నిలిపివేత

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తమిళ సినిమా షూటింగ్ నిమిత్తం పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించడంతో తిరుమలకు వెళ్లే అలిపిరి వద్ద ట్రాఫిక్ జామ్ అయిన సంఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. తమిళ్ హీరో ధనుష్ తాజా చిత్ర షూటింగ్‌ను మంగళవారం ఉదయం అలిపిరి సమీపంలోని శ్రీ బాలాజీ లింకు బస్టాండ్ వద్ద అనుమతించడంతో అటువైపు వెళ్లే వాహనాలను పోలీసులు దారి మళ్ళించారు. దీంతో తిరుమలకు వెళ్లే భక్తులు ఇబ్బంది పడ్డారు. తిరుమలకు వెళ్లే వాహనాలను ఇస్కాన్ మార్గం, టీటీడీ గోడౌన్, రుయా ఆస్పత్రి, బధిర హాస్టల్ మీదుగా దారి మళ్ళించారు. చిత్తూరు- బెంగళూరు -మదనపల్లి ప్రాంతాలకు వెళ్లే వాహనాలకూ ఇదే ప్రధాన రహదారి కావడంతో సుమారు అర్ధకిలోమీటర్ దూరం వాహనాలు నిలిచిపోయాయి. ఉదయం 6 గంటల నుంచి షూటింగ్ ప్రారంభం కావడంతో 8, 9 గంటల మధ్య స్విమ్స్, రుయా, మెటర్నిటీ, బర్డ్, కార్పొరేషన్ కార్యాలయం, ఎస్బిఐ ఆయుర్వేదిక్ హాస్పిటల్, శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల, శ్రీ పద్మావతి చిల్డ్రన్స్ హృదయాలయ ఆసుపత్రి, భారతీయ విద్యాభవన్, ఎస్వీ మెడికల్ కళాశాల, ఎస్వీ యూనివర్సిటీ, వేదిక యూనివర్సిటీ, సంస్కృత యూనివర్సిటీ ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, రోగులు, వారి సహాయకులు ట్రాఫిక్ జాంలో ఇరుక్కుని తీవ్ర అవస్థలు పడ్డారు. పోలీసులు ముందస్తు సమాచారం ఇవ్వకుండా, ప్రత్యామ్నాయ మార్గాలు చూపకుండా, ఉన్నపలంగా ట్రాఫిక్ మళ్ళించడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. విమర్శలు రావడంతో సినిమా షూటింగ్‌ను చిత్ర యూనిట్ నిలిపివేసింది. రెండు రోజుల పాటు గరుడ విగ్రహం, నంది సర్కిల్, గోవిందరాజస్వామి ఆలయాల వద్ద అనుమతి తీసుకున్నా, చిత్రం యూనిట్ సభ్యులకు, ప్రజలకు మధ్య రద్దీ విషయమై గొడవ జరగడంతో పోలీసు స్టేషన్‌లో కేసులు పెట్టుకునే వరకూ వెళ్లింది. దీంతో తాత్కాలికంగా షూటింగ్‌ను నిలిపేశారు.

రుణ వసూళ్ల లక్ష్యాలను వేగవంతం చేయాలి : సిఇఒ

ప్రజాశక్తి - గూడూరు టౌన్

సహకార బ్యాంకుల పరిధిలోని సొసైటీలలో రుణ వసూళ్లు లక్ష్యాలను అధికారులు సిబ్బంది వేగవంతం చేయాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ సి ఈ ఓ శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ఆయన వింజమూరులో జోనల్ స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార బ్యాంకుల వారీగా క్షేత్ర స్థాయిలో ప్రత్యేక రివ్యూ చేపట్టారు. రుణ



వసూళ్లను త్వరితగతిన పూర్తి చేసి బ్యాంకుల పురోభివద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా రుణాలు సకాలంలో చెల్లించిన రైతులకు తగిన రీతిలో మెరుగైన తోడ్పాటును అందించాలని దిశా నిర్దేశం చేశారు. ఇందులో భాగంగా ప్రధానంగా సహకార నేస్తం డిపాజిట్ పథకం కింద 444 రోజులకు గానూ అత్యధికంగా 7.75 పర్సెంట్ వడ్డీతో సహా సీనియర్ సిటిజన్స్ కు 8.25 పర్సెంట్ ఇవ్వబడునని, ఈ సదవకాశమును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జి.ఎం సరిత, డి.జి.ఎం లు నాగేంద్ర కుమారి , దయాకర్ రెడ్డి , మధు సుధన్ , గూడూరు, కోట, వాకాడు, నాయుడుపేట, సుల్లూరు పేట బ్రాంచి మేనేజర్లు పాల్గొన్నారు.

లెప్రసీపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా కుష్టువ్యాధి పై జిల్లా వైద్య విభాగం ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక స్విమ్స్ సర్కిల్ వద్ద జరిగిన కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ యు. శ్రీహరి, జిల్లా లెప్రసీ ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి డాక్టర్ అరుణ సులోచన ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డిఎంఅండ్‌హెచ్‌వో ఆఫీసు నుండి స్విమ్స్ మెడికల్ కాలేజీ వరకు నిర్వహించిన ఈ ర్యాలీని ఉద్దేశించి వారు మాట్లాడుతూ లెప్రసి పై అపోహలు నమ్మ వద్దని సరైన మందుల వాడితే నివారించడం సులభమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామింగ్ అధికారులు, వైద్యులు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి- ఏర్పేడు: ఏర్పేడు మండలం మేర్లపాక గ్రామ పంచాయతీలో మంగళవారం ఉదయం 10 గంటలకుసర్పంచ్ కే గంగాధర్ అధ్యక్షతన మేర్లపాక ప్రాథమిక పాఠశాలలో గ్రామ ప్రజలకు కుష్టు వ్యాధి లక్షణాలు, వ్యాధి ఆరంభ దశలో వ్యాధిగ్రస్తుడు పాటించవలసిన సూచనలు తెలిపారు. గాంధీ వర్ధంతి సందర్భంగా మహాత్మునికి నివాళులర్పించారు. ఈ అవగాహనలో పంచాయతీ సెక్రటరీ జయశ్రీ, ఏఎన్ఎం సుజాత, ఆశా వర్కర్ లక్ష్మి, ముని, అంగన్వాడి టీచర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బూత్ ఇన్‌ఛార్జిలదే కీలక పాత్ర: సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం సాధించాలంటే క్లస్టర్ యూనిట్ బూత్ ఇన్‌ఛార్జిలే కీలకపాత్ర వహించాలని ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ భవనంలో మంగళవారం నియోజకవర్గ స్థాయి క్లస్టర్ యూనిట్ బూత్ ఇన్‌చార్జిలతో ఆయన సమావేశం అయ్యారు. రాబోయే ఎన్నికల్లో క్లస్టర్ యూనిట్ బూత్ ఇన్‌చార్జిల పాత్రను తెలుపుతూ ప్రజలతో ఎలా మమేకం కావాలో వివరించారు. ఓటర్ల జాబితా పరిశీలన, భవిష్యత్తుకు గ్యారెంటీ అమలుపై ఓటర్లలో అవగాహన కల్పించాలని సూచించారు. పలువురు సీనియర్ టిడిపి నేతలు పాల్గొన్నారు.

నారా చిన్నబ్బ నాయుడుకి పరామర్శ

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరి మండలం నారావారిపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, టిడిపి జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బంధువు నారా చిన్నబ్బ నాయుడు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం నాయకుల ద్వారా తెలుసుకున్న చిత్తూరు జిల్లా టిడిపి అధ్యక్షుడు చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని నాయకులతో కలసి చిన్నబ్బ నాయుడుని పరామర్శించారు. ఎగువకూచివారిపల్లెలో కార్యకర్తల సమావేశం అనంతరం ఆయన పార్టీ నాయకులతో కలిసి చిన్నబ్బ నాయుడును పరామర్శించి కుటుంబ సభ్యులనడిగి ఆరోగ్య వివ రాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బషీర్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఐఎంఎ

ప్రజాశక్తి- రేణిగుంట : కోవిడ్ సమయంలో వైద్యం అందిస్తూ మరణించిన రేణిగుంట ప్రముఖ వైద్యులు డాక్టర్ బషీర్‌ను స్మరించుకుంటూ ఆయన సతీమణి దిల్షాద్ బేగం, కుటుంబ సభ్యులను డాక్టర్ల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జనార్దన్, ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు, సర్పంచ్ నగేషం, మండల కోఆప్షన్ మెంబర్ హసన్ సాహెబ్ పరామర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేణిగుంటలో ప్రజా వైద్యశాల పేరుతో ప్రజలకు వైద్యం అందించే గొప్ప డాక్టరును కోల్పోయామని పేర్కొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి యాక్ట్ పై అవగాహన

ప్రజాశక్తి -ఏర్పేడు: ఏర్పేడు మండలం చింతలపాలెం కాలనీలో మంగళవారం ఎన్ సంజయ్ ఐపిఎస్ అడిషనల్ డీజీపీ, సిఐడి ఆఫ్ ఏపీ వారి సూచనల మేరకు డిఎస్‌పి ఆర్ ఓ తిరుపతి సిఐడి ఏ పద్మలత ఆధ్వర్యంలో ఎస్సీ-ఎస్టీ యాక్ట్ 1989 పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం షెడ్యూల్డ్ కులాలు , షెడ్యూల్డ్ తెగలు సంఘాల సాధికారత , వారిపై అఘాయిత్యాల నివారణపై చైతన్యం చేయడం అన్నారు. ఎస్సీ- ఎస్టీ చట్టాలపై అవగాహన తెచ్చుకుని వారిపై జరిగే అరాచకాలను రూపుమాపాలని, ప్రతి ఒక్కరూ ప్రశ్నించే తత్వం అలవరుచు కోవాలన్నారు. కార్యక్రమంలో ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు , చంద్రశేఖర్ డివిజనల్ కోఆర్డినేటర్, జిలాని ఎస్ఐ ఏర్పేడు, సురేష్ ,ఉప సర్పంచ్, మురగయ్య ఈఓఆర్డి, ఉదయ్ కుమార్ రెడ్డి న్యాయవాది, గాయత్రి పంచాయతీ సెక్రటరీ, తులసి మహిళా పోలీస్, సిఐడి సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతతో బస్సులు నడపండి: ఎంవిఐ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్కూల్, కాలేజీ బస్సులు నడిపే డ్రైవర్లు బాధ్యతతో మసులుకోవాలని శ్రీకాళహస్తి మోటార్ వాహనాల తనిఖీ అధికారి దామోదర్ నాయుడు సూచించారు. రవాణా భద్రత మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ఎంవిఐ కార్యాలయంలో మంగళవారం ప్రైవేట్ స్కూల్, కాలేజీ బస్సు డ్రైవర్లతో దామోదర్ నాయుడు సమావేశమయ్యారు. స్కూలు బస్సులు నడిపే డ్రైవర్లు అందరూ చాలా అప్రమత్తతో విద్యార్థులను క్షేమంగా వారి గమ్య స్థానాలకు చేర్చాలని తెలిపారు. వాహనాన్ని మితిమీరిన వేగంతో, మద్యం, మత్తుపదార్థాలు సేవించి నడుపరాదని సూచించారు. సెల్ ఫోన్ వాడుతూ బస్సు నడపడం చేయరాదని హెచ్చరించారు. ప్రతి బస్సుకు డ్రైవర్ తో పాటు ఒక అటెండర్ కచ్చితంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

'విశాఖ డిపిటివో కక్ష సాధింపు మానుకోవాలి'

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : నేషనల్ మజ్దూర్ యూనియన్ సభ్యులపై విశాఖ డీటీపీవో కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని, లేదంటే నిరసనలు ఉధృతం చేస్తామని యూనియన్ జోనల్ చైర్మన్ శ్రీనివాసులు హెచ్చరించారు. గూడూరు పట్టణంలోని ఆర్టీసీ గేటు వద్ద ఎన్ఎంయు ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు నిరసన ధర్నా చేపట్టారు. అధికారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కార్మికుల పట్ల కక్ష సాధింపు చర్యలు మానుకుని సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ అసిస్టెంట్ కార్యదర్శి శ్రవణ. డిపో ప్రెసిడెంట్ కిషోర్, డిపో ప్రెసిడెంట్ బాష, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, గ్యారేజి సెక్రటరీ ప్రవీణ్, గ్యారేజి ప్రెసిడెంట్ శ్రీధర్ పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి ఘన సన్మానం

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరి సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న ఏఎస్ఐ డీకే మునిరత్నం, హెడ్ కానిస్టేబుల్ భూపతి సుబ్రహ్మణ్యం సేవలు మరువలేనివని చంద్రగిరి సీఐ రాజశేఖర్ అన్నారు. చంద్రగిరి సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల పనిచేస్తూ పదవి విరమణ పొందిన పోలీసు సిబ్బందికి సన్మానం, ఆత్మీయ వీడ్కోలు నిర్వహించారు. చంద్రగిరి పోలీస్ స్టేషన్ విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ భూపతి సుబ్రహ్మణ్యం, రామచంద్రపురం మండలం ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందుతున్న డీకే మునిరత్నం సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా సీఐ రాజశేఖర్ మాట్లాడుతూ జీవితంలో ఉద్యోగం,పదవీ విరమణ పొందడం సాధారణమని ,ఉద్యోగ సమయంలో విపత్కర పరిస్థితుల్లో ఎలాంటి రిమార్కులు లేకుండా, ఉద్యోగ విధులను సమర్థవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ఆర్ సి పురం ఏఎస్ఐ డీకే మునిరత్నం దంపతులు, చంద్రగిరి హెడ్ కానిస్టేబుల్ భూపతి సుబ్రహ్మణ్యం దంపతులను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు హిమబిందు, గిరిబాబు, ఏఎస్ఐ సుధాకర్, ఏఎస్ఐ మురళి రెడ్డి, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి, కార్యదర్శి సుబ్బయ్య, చంద్రగిరి పోలీస్ సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ పురుషోత్తమ నాయుడు పాల్గొన్నారు.

'వినియోగదారుల సేవే పరమావధి'

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: వినియోగదారుల సేవే పరమావధిగా మహాత్మా గాంధీ ఆశయాలను అనుసరించాలని విద్యుత్ అధికారులు, సిబ్బంది వినియోగదారులకు నాణ్యమైన సేవలందించాలని ఏపిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ (టెక్నికల్, హెచ్ఆర్) ఎస్.వి.ఎస్. సుబ్బరాజు పేర్కొన్నారు. ఏపిఎస్‌పి డిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో మంగళవారం మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సుబ్బరాజు మాట్లాడుతూ మహాత్మాగాంధీ అవలంబించిన మానవతావాదం, అహింస, శాంతి సిద్ధాంతాల గురించి అందరూ తెలుసుకోవాలన్నారు. డైరెక్టర్ (ప్రాజెక్ట్, ఐటీ) కె. శివప్రసాద రెడ్డి, చీఫ్ జనరల్ మేనేజర్లు జె. రమణాదేవి, వై. లక్ష్మీనరసయ్య, పి. అయూబ్ ఖాన్, కె. గురవయ్య, కె.ఆర్.ఎస్. ధర్మజ్ఞాని పాల్గొన్నారు.

పంట పొలాలపై ఏనుగుల దాడి

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి): మండలంలోని శేషాపురం, చిన్న రామాపురం గ్రామాలలోని పంట పొలాలను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. శేషాచలం అడవుల్లోని భాకరాపేట అటవీ ప్రాంతం నుండి ఏనుగుల గుంపు 20 రోజుల క్రితం వచ్చాయి. సోమవారం శేషాపురానికి చెందిన సంపూర్ణమ్మ, నాగేశ్వరరావు పొలాలలోని పంటలను ధ్వంసం చేశాయి. చెన్నకేశవులకు చెందిన 14 మామిడి చెట్లు, అరటి చెట్లను ధ్వంసం చేశాయి. చిన్న రామాపురం గ్రామంలో షాజహాన్ కు చెందిన రెండు ఎకరాలలో కొబ్బరి, మామిడి, అరటి చెట్లను ధ్వంసం చేయడమే కాకుండా పొలానికి వేసిన ఇనుప కంచను కూడా ధ్వంసం చేశాయి. సోమవారం రాత్రి సుమారు 13 ఏనుగులు పొలాల్లోకి ప్రవేశించి భీకరంగా అరుపులు అరుస్తూ డ్రిప్ ఇరిగేషన్ పైపులను, జొన్న గడ్డిని ధ్వంసం చేశాయి. ఏనుగుల భీకరమైన అరుపులకు రైతులు భయపడిపోయామని వాపోయారు. రైతులు అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో అటవీ శాఖ అధికారులు మంగళవారం పొలాల వద్ద రాత్రి వేళల్లో బాణాసంచాలు పిలుస్తూ, డప్పులు వాయిస్తూ ఏనుగులను బెదిరించి కళ్యాణి డ్యాం అటవీ ప్రాంతం వైపు మళ్ళీ ఇస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. దీంతో గ్రామంలోని రైతులు ఊపిరి పీల్చుకున్నారు.




ఏనుగుల దాడిలో ధ్వంసమైన మొక్కలు

ఉడ్ సైడ్ హోటల్స్ అధినేత మృతి

పలువురి నేతలు, స్థానికుల సంతాపం

ప్రజాశక్తి -తిరుమల: ప్రముఖ ఉడ్ సైడ్ హోటల్స్ అధినేత కృష్ణబట్ ఇక లేరు. అనారోగ్యంతో చెన్నై ప్రయివేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. ఆయన మృతితో తిరుమల, తిరుపతి హోటల్స్ అధినేతలు సంతాపం తెలిపారు. నాలుగు దశాబ్దాలుగా హోటల్స్ రంగంలో తనదైన శైలిలో అంచెలంచెలుగా ఎదిగిన కృష్ణ బట్ పలు సేవా కార్యక్రమాలు చేశారు. ఆయన మరణంతో కుటుంబ సభ్యులు పెద్ద దిక్కు కోల్పోయామని కన్నీటి పర్యంత మయ్యారు. తిరుపతి తిరుమల రాజకీయ ప్రముఖులు ఆయనకు నివాళి అర్పించారు. వైసిపి నేత భూమన అభినయ రెడ్డి నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులు భార్య ఉషా బట్ మాట్లాడుతూ నిత్యం ప్రజా సేవలో ఉంటూ అనేక మందికి నిత్యం అన్నదానం చేస్తూ వచ్చారన్నారు. అల్లుడు డాక్టర్ రాజేష్, కుమార్తె అర్చన , అల్లుడు హితేష్, చిన్న కుమార్తె, అపర్ణ ప్రగాఢ సానుభూతి తెలి పారు. బుధవారం గోవింద ధామంలో 9 గంటలకు దహన క్రియలు నిర్వహించ నున్నట్లు తెలిపారు.



ఉడ్ సైడ్ హోటల్స్ అధినేత కృష్ణబట్

గాంధీకి ఘన నివాళి

ప్రజాశక్తి -సత్యవేడు: గాంధీ వర్ధంతి సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఎం రమేష్ స్థానిక గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ గాంధీ ఉద్యమాలు, పోరాటాలు స్వాతంత్ర్యోద్యమానికి దోహదపడ్డాయన్నారు. హిందూ, ముస్లింల ఐక్యత కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం గాంధీజీ కృషి చేశారని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ అహింసావాదిఅని ఆయనను హత్య చేసిన గాడ్సే భావాలు కలిగిన వ్యక్తులను అడ్డుకోవడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు మురళి, కృష్ణయ్య, అమూల్, రోస్లిన్, విజయ, జమున పాల్గొన్నారు.

తిరుపతి(మంగళం): మహాత్మ గాంధీ ఆశయాల కోసం శ్రమిద్దామని తిరుపతి నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ భూమన అభినయ రెడ్డి అన్నారు. మంగళవారం తిరుపతి-కరకంబాడి మార్గంలోని నగర పాలక సంస్థ 50వ డివిజన్ తిమ్మినాయుడుపాలెంలో మహాత్మా గాంధీ 76వ వర్ధంతి సందర్భంగా పేదలకు కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ పిసి రాయలు, కేంద్ర ట్రస్ట్ మాజీ డైరెక్టర్, గాంధీజీ మనుమరాలు సవిత సింగ్ ఆధ్వర్యంలో వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన భూమన అభినయ రెడ్డి మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న స్వరాజ్యాన్ని సీఎం జగన్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సహకారం అయిందన్నారు. పిసి రాయలు మాట్లాడుతూ కస్తూర్బా ట్రస్టు ద్వారా దశాబ్దాలుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అనిల్, నరసింహాచారి, కో ఆప్షన్ సభ్యులు శ్రీదేవి, మాజీ తిమ్మనాయుడుపాలెం సర్పంచి ఆదం సుధాకర్ రెడ్డి, చెంగల్రాయులు, స్థానిక వైసిపి ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

రేణిగుంట: పట్టణంలోని పాంచాలి నగర్ ఎలిమెంటరీ స్కూల్లో మంగళవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గాంధీజీ వర్ధంతి నిర్వహించారు ముందు గాంధీజి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు ఓ వెంకట రమణ మాట్లాడుతూ "స్వాతంత్ర్య పోరాటంలో ప్రధాన పాత్ర వహించడమే కాకుండా, అశ్రుప్యత నిర్మూలనకు, మత సామరస్యం కోసం కృషి చేశారన్నారు. మతసామరస్యంను అందరూ పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, గీత జన విజ్ఞాన వేదిక మండల కార్యదర్శి కుప్పస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : గాంధీ అడుగుజాడలో నడవాలని. డాక్టర్ కె.వి నాయుడు పేర్కొన్నారు. రూరల్ మండలం వేపగుంట హైస్కూలులో ఈ సందర్భంగా ఆయన ఫోన్ ద్వారా ఆన్‌లైనులో మాట్లాడుతూ గాంధీజీ సిద్ధాంతాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహకులు డా. ఎ. భాగ్యరాజ్, గామ సర్పంచ్ గిరిజా ప్రసాద్, మోహన్ గాంధీ, పాఠశాల ఉపాధ్యాయులు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు కుప్పయ్య, కరుణాకర్, డి మోసెస్, లత ప్రమీల మాధవి సూర్యం నారాయణ పాల్గొన్నారు.

క్యాంపస్ : పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో గాంధీ స్క్వేర్ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి ఉపకులపతి ఆచార్య డి భారతి పూల మాల వేసి నివాళులర్పించారు. ఉదయం 11 గంటలకి యూనివర్సిటీలో రెండు నిమిషాల పాటు మౌనం పాటించి ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మహాత్మా గాంధీ గురించి ఇలా కొనియాడారు. ఆయన ఉన్నత ఆశయాలని కొనియాడారు. ఈ కార్యక్రమానికి ఆచార్య ఎన్ రజనీ, విభాగాల డీన్లు, విభాగాధిపతులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అందరికీ వైద్య సేవలు అందించాలి: వైస్ ఎంపీపీ

ప్రజాశక్తి -దొరవారిసత్రం: ఆరోగ్య సురక్ష ద్వారా అందరికీ వైద్య సేవలు అందేలా ఆరోగ్య సిబ్బంది పనిచేయాలని దొరవారిసత్రం మండల వైసిపి సీనియర్ నాయకులు, వైస్ ఎంపీపీ దువ్వూరు గోపాల్ రెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని నెలబల్లి గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్షకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులందరికీ ఆరోగ్య సేవలు అందించేలా పనిచేయాలని, ప్రభుత్వ లక్ష్యాన్ని ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాధారణ రోగులతో పాటు, బిపి, షుగర్, వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి సలహాలతో పాటు మందులు పంపిణీ చేశారు. 50ఏళ్లు పైబడిన వృద్ధుల్లో కంటి చూపు లోపాలున్న వారికి పరీక్షలు నిర్వహించి ఉచిత అద్దాలకు సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రఘురామయ్య, ఇన్‌ఛార్జి సెక్రెటరీ ప్రణయ్, వీఆర్వో రమేష్, వైద్యాధికారులు చైత న్య, ద్రాక్షాయణి, స్టీఫెన్ నవీన్ రోగులకు వైద్య సేవలు అం దించారు. ఆప్తమా లజిస్ట్ లలిత్ కుమార్, సిహెచ్‌ఓ సంపూర్ణమ్మ, పిహెచ్ఎన్ పద్మావ తి, ల్యాబ్ టెక్నీషియన్ మురళి, హెల్త్ అసిస్టెంట్ విజయ్ కుమార్, వెంకటయ్య, రత్నయ్య, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వార్డుల్లో సమస్యలు పరిష్కరించరా?

మున్సిపల్ సమావేశంలో నిలదీసిన కౌన్సిలర్లు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వార్డుల్లో సమస్యలు ఎందుకు పరిష్కరించడంలేదని కౌన్సిలర్లు ఛైర్మన్‌ను నిలదీశారు. మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం పట్టణంలోని వైయస్సార్ భవనంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఏ హరి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 'మా ఎస్సీ వార్డులో సమస్యలు ఎక్కువగా ఉన్నాయి? నిధులు ఎక్కువగా ఎందుకు కేటాయించలేదు? గతంలో పెండింగు సమస్యలు పరిష్కరించలేదు?' అని ప్రశ్నించారు. సమస్యలు ఎక్కువగా ఉన్నాయని వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు. టిడిపి కౌన్సిలర్ గాలి జీవరత్నాయుడు మాట్లాడుతూ 22 వ వార్డులో ఏ పనులూ చేపట్టలేదని ఆరోపించారు. దీంతో మున్సిపల్ ఛైర్మన్‌కి, టిడిపి కౌన్సిలర్ కి మధ్య వాదోప వాదాలుసాగాయి. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కు మరమ్మతులు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. స్పందించిన మున్సిపల్ ఛైర్మన్ హరి మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రభుత్వం హయాంలో కట్టిందేనని నాసిరకం కావడంతో తెగి పోయిందన్నారు. అందుకోసం మంత్రి ఆర్కే రోజా మంజూరు చేసిన నిధులతో నిర్మాణానికి టెండర్లు పిలిచా మన్నారు. కళ్యాణపురం ఎస్‌టి కాలనీలో గతం లో మాజీ ఎమ్మెల్యే గాలి ముద్దుకృష్ణ నాయుడు ఎస్టీల కోసం కేటాయించారని, అప్పుడు ఇచ్చిన స్థలంలో ఇళ్లు కట్టుకుంటు న్నారన్నారు. స్పందించిన గాలి జీవరత్నం నాయుడు పాఠశాలలో పిల్లల కోసం ఏర్పాటు చేసిన స్థలం అనడంతో వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. తెలుగు గంగ కాలువ పైప్ లైన్ సిద్ధార్థ కాలేజీ వరకు తీసుకొచ్చి వదిలేశారని వాటిని తీసుకొచ్చి సమ్మర్ స్టోరేజీ లో వదలకుండా ఎందుకు వదిలిపెట్టారని నిలదీశారు. ఇప్పటికైనా స్పందించి సమ్మర్ స్టోరేజీ పనులు పూర్తి చేసి పైప్ లైన్ తో తెలుగు గంగ నీళ్ల తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్‌లు జయ ప్రకాష్, శంకర్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎం రెడ్డి, డీఇ, ఏఈలు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో నిలదీస్తున్న కౌన్సిలర్లు

'దళితులకు సముచిత స్థానం వైసిపి లోనే..'

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పై చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారం రేపాయి. మండలంలో ఇందుకు సంబంధించి మంగళవారం వైసిపి దళిత నాయకులు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ దళితులకు సముచిత స్థానాన్ని కల్పించింది వైయస్ జగన్మోహన్ రెడ్డి అని గత ప్రభుత్వాలలో దళితులను ఒక ఓటు బ్యాంకు లాగా వినియోగించుకున్నారే తప్ప పదవులు, అధికారాన్ని కట్టబెట్టలేదని ఆ ఘనత వైసిపికే దక్కిందన్నారు. దళితులంతా జగన్మోహన్ రెడ్డి పై కృతజ్ఞతా భావంతో ఉన్నారని ఆదిమూలం చేసిన వ్యాఖ్యలు పూర్తిగా తన స్వలాభం కోసం మాత్రమేనని ఆ మాటలతో దళితులకు ఎటువంటి సంబంధం లేదని దళితులందరూ జగన్మోహన్ రెడ్డి వెనకే ఉన్నారని వాళ్ళ గుర్తు చేశారు. అసెంబ్లీ స్థానాల నుండి దళితుల కోసం ప్రత్యేకంగా పథకాలను ప్రవేశపెట్టిన ఘనత వైసిపిదేనని, పార్టీ మారాలని ఉద్దేశంతోనే తప్పుడు ప్రచారాలు ఆదిమూలం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎమ్మెల్యే కనుసన్నల్లో గత ఐదేళ్లుగా నియోజకవర్గంలో అనేక కాంట్రాక్టు పనులతో సహా లబ్ధి పొందిన పొందింది రెడ్డిలే నని దళిత ఎమ్మెల్యే తో సమస్య ఏర్పడితే ప్రెస్ మీట్‌లు పెట్ట డానికి మాత్రం ఇప్పుడు దళితులు కావాల్సి వచ్చిం ద ని స్థానికంగా కొంతమంది దళితులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కొంతమంది వైసిపి నాయకుల తీరు ఇప్పటికైనా మారాలని పార్టీలో ఎన్నో సంవత్సరాలుగా పార్టీ జెండాను మోస్తున్న దళితులను చిన్నచూపు చూస్తున్నారని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు ఇప్పటికైనా అలాంటి వారు కష్టపడుతున్న కార్యకర్తలు గుర్తించకపోతే పార్టీ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని హెచ్చరించారు. ఇప్పటికీ కొంతమంది వైసీపీ నాయకులు కోనేటి ఆదిమూలంకు అండగా నిలవడం కోసం మెరుపు.



మాట్లాడుతున్న వైసిపి దళిత నాయకులు

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

ప్రజాశక్తి - ఓజిలి : ఉపాధి హామీ 2022 -23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక మంగళవారం మండల కేంద్రం ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ సివి శ్రీనివాస్ ప్రసాద్ మాట్లాడుతూ 2022-2023 ఆర్థిక సంవత్సరానికి మండలంలోని 26 పంచాయతీల్లో చేపట్టిన 226 పనులకు కూలీల రూపంలో రూ.7 కోట్ల30లక్షల రూపాయలు ఉపాధి పనులపై క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసిన వివరాలను అధికారులు వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా చేసిన పనులపై వివిధ శాఖలకు లక్ష 61 వేల రూపాయలు నగదు రికవరీ చేయాలని సంబంధిత సిబ్బందికి తాఖీదులు జారీ చేయాలని ఆదేశించారు. శిలాఫలకాలు ఏర్పాటులో సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఏడాది ఆర్థిక సంవత్సరంలో 12 కోట్ల రూపాయలు పనులు నిర్వహించగా, ఈ ఆర్థిక సంవత్సరంలో ఏడు కోట్ల రూపాయలకే పనులు పరిమితి కావడం ఉపాధి సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. పేదవాళ్లకు తిండి పెట్టే ఉపాధి పనులు కల్పించకపోవడంతో గత ఏడాది కంటే ఈ ఏడాది పనులు తగ్గాయని ప్రజలు వాపోతున్నారు. ఈ కార్యక్రమంలో డివిఓ భాగ్యలక్ష్మి , ఏపీ డి రవి నాయుడు , డిఆర్డిఏ ఏపీడీ ప్రభావతి , అంబుడ్స్ మెన్ రాసానాయుడు , ఎంపీడీవో వి రజినీకాంత్ , ఏపీవో ఉషారాణి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధి పనుల సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు

తూతూ మంత్రంగా మండల సమావేశం

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి): మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి అధ్యక్షతన సమావేశం తూతూ మంత్రంగా సాగింది. మండలంలో వివిధ గ్రాంట్లు లో మంజూరైన అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలన్నారు. మండలంలో విద్యుత్ శాఖ సంబంధించి పలు సమస్యలను విద్యుత్ శాఖ అధికారులు దృష్టికి తీసుకొచ్చారు. చంద్రగిరి నేషనల్ హైవే నుండి శ్రీనివాస మంగాపురం వరకు ఉన్న ఆర్అండ్‌బి రోడ్డు, చంద్రగిరి, అనుపల్లి రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఆర్ అండ్‌బి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సూర్యనారాయణ రెడ్డిని కోరగా, నిధులు మంజూరయ్యాయని వెంటనే మరమ్మతులు చేపడతామని తెలిపారు. మండల మండల సర్వసభ్య సమావేశంలో ప్రతిపక్ష పార్టీకి సంబంధించిన ఎంపీటీసీలు, సర్పంచులు లేకపోవడంతో, అధికార పార్టీ చెందిన ఎంపీటీసీలు సర్పంచ్‌లు ఉండడంతో ప్రజా సమస్యలపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా, అధికారులను ప్రశ్నించకపోవడంతో సమావేశం తూతూ మంత్రంగా సాగింది. స్వపక్షానికి చెందిన సభ్యులు వారి ప్రాంతాలలోని పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలాజీ నాయక్, అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు సర్పంచులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న మాట్లాడుతున్న ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి

క్రైం న్యూస్

మద్యం అక్రమ తరలింపు పట్టివేత

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలోని పదవ 'మైలు మలుపు వద్ద బంగ్లా తోట గ్రామానికి చెందిన రమేష్ అక్రమంగా తరలిస్తుండగా సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ వెంకట నరసింహ తన సిబ్బందితో కలిసి మంగళవారం పట్టుకున్నారు. కేసు నమోదు చేసి వారి నుండి పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు వస్తున్న తరుణంలో ఎవరైనా మద్యం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది నరేష్ రేగన్ పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో ఎంజీఎం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక ఎంజీఎం ఇంగ్లీష్ మీడియం స్కూల్లో నిర్వహించిన ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ రౌండ్ -1 లో పరీక్ష ఫలితాల్లో అదే పాఠశాలకు చెందిన 170 మంది విద్యార్థులకు ఉత్తీర్ణత సాధించారు. రౌండ్-2 పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను స్థానిక పాఠశాలలో మంగళవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మునిరత్నం నాయుడు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యంకు డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి అవ్వారు సుబ్రహ్మణ్యంకు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి మూడే దామ్లా నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆచార్య ఆర్విఎస్ సత్యనారాయణ పర్యవేక్షణలో 'పర్ఫామెన్స్ ఎన్హాన్స్మెంట్ టెక్నిక్స్ ఫర్ డబుల్ బ్యాలెన్స్డ్ డౌన్ కన్వర్షన్ మిక్సర్ : ఏ క్రిటికల్ స్టడీ' అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు పేర్కొన్నారు. ఇందుకు సుబ్రహ్మణ్యంకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వివరించారు. సుబ్రహ్మణ్యం పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్స్ లలో అనేక పరిశోధన పత్రాలను ప్రచురించారు. అవ్వారు సుబ్రహ్మణ్యంకు డాక్టరేట్ రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, బంధుమిత్రులు శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్‌సిపురం ఎస్ఐ గిరిబాబు బదిలీ

ప్రజాశక్తి -రామచంద్రాపురం: రామచంద్రాపురం మండల ఎస్ఐగా పని చేస్తున్న గిరిబాబు అనంతపురానికి బదిలీ అయ్యారు. ఇన్‌ఛార్జి సబ్ ఇన్‌స్పెక్టర్‌గా తిరుచానూరు ఎస్ఐ చిరంజీవిని పోలీసు ఉన్నతాధికారులు నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ ఎస్ గిరిబాబు సొంత జిల్లాలో పనిచేస్తున్నందున ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మి రెడ్డి ఇటీవల ఎస్ఐల బదిలీల సందర్భంగా ఉత్తర్వు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల మేరకే ఎస్ఐ గిరిబాబు ఆర్‌సి పురం పోలీస్ స్టేషన్ నుండి సోమవారం రిలీవయ్యారు. అనంతపురం జిల్లా పోలీస్ కార్యాలయంలో రిపోర్ట్ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

నేడు 'జయహో బిసి' సభ

ప్రజాశక్తి- యర్రావారిపాలెం: మండల కేంద్రంలో 'నేడు జయహో బీసీ' బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు టిడిపి బీసీ సాధికార సమితి పాలఏకర చిత్తూరు పార్లమెంట్ కన్వీనర్ మల్లూరు దేవి తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగు సంవత్సరాలు నుండి బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాల వారికి ప్రత్యేక నిధులు కేటాయించ కుండా వారి అభివృద్ధిని కుంటుపడేలా చేసిందన్నారు. నాలుగున్నర సంవత్సరం కాలం నుండి రౌడీయిజం, ఇసుక మాఫియా, బూదందా, ఎర్రచందనం లాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. గతంలో టిడిపి ప్రభుత్వం బీసీలకు ఎంతో మేలు చేసిందని సబ్సిడీ రుణాలతో పాటు అనేక సంక్షేమ పథకాలు బీసీలకు ప్రవేశపెట్టారని టిడిపి జిల్లా కార్యదర్శి అన్న సముద్రం మధు అన్నారు. రానున్న 2024 ఎన్నికలలో చంద్రగిరి నియోజకవర్గంలో పులివర్తి నానిని ఎమ్మెల్యేగా అఖండ మెజార్టీతో గెలిపించుకుంటామని హామీ ఇచ్చారు.

నీటిశుద్ధి యంత్రం పంపిణీ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ : వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరుపతి భవాని నగర్‌లోని మునిసిపల్ ప్రాథమిక పాఠశాలకు మహాత్మ గాంధీజీ వర్ధంతిని, జాతీయ కుష్ఠు నివారణ దినోత్సవం పురస్కరించుకొని పేదవిద్యార్థులు దాహార్తి తీర్చేందుకు రూ.15,999 విలువగల నీటిశుద్ధి యంత్రాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవరాజులు నాయుడు అందజేశారు. ఈ సందర్భంగా వాకర్స్ నాయకులు డా.దేవరాజులు మాట్లాడుతూ వాకర్స్ అందరం గాంధీజీ అడుగుజాడల్లో నడుస్తున్నామని నేటితరం వారు కూడా పదిమందికి ఆదర్శంగా ఉండాలని తెలిపారు. వాకర్స్ నాయకులు ఆర్క్యాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ జాతీయ కుష్టురోగ నివారణ దినోత్సవం రోజు పేదవిద్యార్థులకు నీటి ఆర్‌ఓ సిస్టంను వాకర్స్ అసోసియేషన్ ద్వారా అందజేయడం ఆనందంగా వుందన్నారు. తరువాత వాకర్స్ అసోసియేషన్ నాయకులు డా. దేవరాజులు, ఆర్క్యాట్ కృష్ణప్రసాద్ చేతుల మీదుగా ఆర్‌ఓ సిస్టంను ప్రారంభించి పిల్లలకు నీటిని అందించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ నాయకులు డా. దేవరాజులు, ఆర్క్యాట్ కృష్ణప్రసాద్, ప్రభాకర్ , రవీంద్ర రెడ్డి, వెంకటరమణ రెడ్డి, కెవి రమణయ్య , , సత్య ,వి. చంద్రశేఖర్ రెడ్డి , వై .జగదీష్ రెడ్డి పాల్గొన్నారు.

22 నుంచి ఉడ్ వర్కింగ్, ఫర్నీచర్ ప్రొడక్షన్ టెక్నాలజీపై గ్లోబల్ సమ్మిట్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఉడ్ వర్కింగ్, ఫర్నీచర్ ప్రొడక్షన్ టెక్నాలజీపై 'ఇండియావుడ్ 2024' ఫిబ్రవరి 22 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్నామని ఆ సంస్థ ప్రతినిధులు ప్రకటనలో పేర్కొన్నారు. ఇది ఇండియా వుడ్ 13వ ఎడిషన్. ఈ ప్రదర్శనలో 950 పైగా కంపెనీలు, 50 పైగా దేశాల నుంచి 75 వేలకు పైగా వాణిజ్య సందర్శకులు విచ్చేయనున్నారు. ఇది 75 వేల స్క్వేర్ మీటర్ల ఎగ్జిబిషన్ ప్రాంతం. ఈ ఈవెంట్ తాజా ఆవిష్కరణలు, సాంకేతికతపై ఒక అవగాహన అందిస్తుంది. ఎన్నో నెట్‌వర్కింగ్ అవకాశాలను కూడా అందిస్తుంది. 'ఇండియా వుడ్ 2024' ఈవెంట్ చరిత్రలో అతిపెద్దది. ప్రపంచంలో ఉన్న పరిశ్రమ నాయకులు, సాంకేతికత సరఫరాదారులు, కొనుగోలుదారులను ఒకచోట చేర్చుతుంది.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ పంపిణీ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ : సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ తిరుపతి షోరూంలో 107 మంది విద్యార్థినులకు స్కాలర్‌షిప్పులు మేయర్ డాక్టర్ శిరీష పంపిణీ చేశారు. తిరుపతి జోనల్ హెడ్ నిఖిల్ చంద్రన్, స్టోర్ హెడ్ రెజీశ్ హాజరయ్యారు. ఒక్కొక్కరికి 8వేల నుంచి పదివేల చొప్పున 9లక్షల 72వేల మొత్తాన్ని అందజేశామన్నారు.



మలబార్ గోల్డ్ షోరూం ఆధ్వర్యంలో విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్న దృశ్యం